క్లుప్తంగా

పరశురాముడిగా జగన్నాథస్వామి



పరశురామావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి బుధవారం పరశు రామావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు గురు సంతోష్ సుభద్ర, బలభద్రుని సహిత జగన్నాథస్వామిని పరశురామావతారంలో అలంకరించారు. అగనంపూడి పరిసర నిర్వాసితకాలనీలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో అగనంపూడి నిర్వాసితకాలనీలు పెదమడక, కొండయ్యవలస ప్రాథమిక పాఠశాలల్లో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, కె.అప్పారావును అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, గుదే సుశీలా గజేంద్రరావు, గంతకోరు అప్పారావు, ఇందల నారాయణరావు, వద్దాది శ్రీను, మజ్జి శ్రీను, గోపిశెట్టి రమాదేవి, వాణి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.


పేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

కూర్మన్నపాలెం: కణితిలో రథాలమ్మ మారు వారాన్ని పురస్కరించుకొని బుధవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. గత వారం జరిగిన సిరిమాను ఉత్సవం సందర్భంగా అమ్మవారికి భక్తులు చీరలు సమర్పించారని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఇలా అమ్మవారికి సమర్పించిన సుమారు 850 చీరలను రామాలయం వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రగడ శ్రీనివాసరావు, దుర్గపుదానప్పలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో మహిళా కళాశాల ప్రిన్సిపాల్

అగనంపూడి: ఉత్తమ ఇంజినీర్లుగా తీర్చిదిద్దడమే విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆశయమని కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి అన్నారు. కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఇన్ఫినిటీ కంప్యూటర్ సొల్యూషన్స్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో వార్షిక వేతనం రూ.4.5లక్షలతో ఎంపికయ్యారు. కళాశాలలో బుధవారం ఆమె అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అందరినీ అలరించింది. ముఖ్య అతిథి రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవులకు అధ్యయనం, భాషా పరిజ్ఞానం, భావ పరిపుష్టి ఉండాలని సూచించారు. విశిష్ట అతిథి డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ కవులకు పలు సూచనలు చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వానికి నిజాయితీతో కూడిన ఆలోచన, ఉద్వేగాలు ముడిసరకుగా ఉండాలన్నారు. అది కవిత్వం కావడానికి రచనా కళ, భావ సౌందర్యం, నేర్పరితనం అవసరమన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కుప్పిలి భీమేశ్వరరావు, సిహెచ్. చినసూర్యనారాయణ, కె.రాంప్రసాద్, కొత్తూరు రమణ, అయ్యల సోమయాజుల ప్రసాద్, కె.విశ్వేశ్వరరావు, పీవీఆర్ కుమార రావు, ఆర్.శివాజీ తదితరులు తమ స్వీయ కవితలు చదివి వినిపించారు.

ఆధ్యాత్మిక కాంతులు



లక్ష్మీపురం కాలనీలోని త్రిశక్తి ఆలయ చిత్రం

> ఆ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కాంతులు విరజిల్లుతున్నాయి. భక్తిభావాన్ని చాటుతున్నాయి. ఏ ప్రాంతంలో చూసినా ఆలయాలు దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజూ పూజలు, హోమాలు, క్రతువులతో కళకళలాడుతున్నాయి. భక్తులతో నిండిపోతున్నాయి. వాటి వార్షికోత్సవాలు, ఉత్సవాలు, పండగలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మికతను చాటి చెబుతున్నారు. దీంతో కూర్మన్నపాలెం, వడ్లపూడి అనగానే ఆలయాలకు కేరాఫ్‌గా కీర్తిగడించాయి.
>
> - కూర్మన్నపాలెం

- ఆలయాలకు కేరాఫ్ వడ్లపూడి, కూర్మన్నపాలెం
- ప్రతి వీధిలో ఆలయం
- దేవతలు రక్షణగా ఉంటారని ప్రజల విశ్వాసం

వడ్లపూడి, కూర్మన్నపాలెంతో పాటు ఉక్కు నిర్వాసిత కాలనీల్లోకి అడుగుపెడితే దేవాలయాలు, అమ్మవార్ల గుడులు స్వాగతం పలుకుతాయి. కాలనీల్లోని ప్రతి వీధిలో భగవంతుడిని ఏదో ఒక రూపంలో నెలకొల్పి అందుకు తగ్గట్టుగా ఆలయాన్ని నిర్మించారు. భక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించారు. అక్కడి పెద్దలు కమిటీలుగా ఏర్పడి వాటిని అభివృద్ధి చేస్తూ ఇష్ట దైవాలకు పూజలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అందువల్లే వారాలు, రోజులతో పనిలేకుండా ఏ దేవాలయంలో చూసినా భక్తులు కనిపిస్తూనే ఉంటారు.

ఆకట్టుకుంటున్న ఆలయాలు

కణితి గవరవీధిలో వెలసిన ఆలయంలో ముందుగా అభయ ఆంజనేయస్వామి దర్శనమిస్తారు. గుడిలో అడుగు పెట్టగానే గౌరీ పరమేశ్వరులు, ఆ తర్వాత మహాకాళి, మహాలక్ష్మి, కనకదుర్గమ్మ, సాయిబాబా విగ్రహాలు దర్శనమిస్తాయి.అలా ముందుకు వెళ్తే అప్పికొండ కాలనీలో ఏడుగుళ్ల కనిపిస్తాయి. విశాలమైన ప్రాంగణంలో నిర్మించిన ఈ ఆలయంలో అమ్మవార్లను సోడిమాంబ, బంగారమ్మ,పరదేశమ్మ, నూకాలమ్మ,బోయమాంబ, పారిపిల్లిమ్మ, ఇంటిఅమ్మవార్ల రూపాల్లో ప్రతిష్ఠించి నిత్యం పూజలు అందుకొనేలా రూపకల్పన చేశారు. ఆ గుడులను 1992లో నిర్మించారు.

త్రిశక్తి ఆలయంలో నిత్య పూజలు

ఇక లక్ష్మీపురం కాలనీలో వెలసిన త్రిశక్తి ఆలయానికి ప్రత్యేకత ఉంది. దుర్గాలమ్మ,నూకాలమ్మ, పోలిపల్లి అమ్మవార్లను దర్శనం చేసుకొంటే కోరిన కోర్కెలు తీరుతాయాని ప్రజలు నమ్మకం. అందువల్ల ఆలయంలో ఎప్పుడూ భక్తుల సందడి ఉంటుంది. ఇక పాత లక్ష్మీపురంలో నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం గురించి చెప్పనక్కర్లేదు. కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి కొలువుతీరిన ఆ గుడికి సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు అక్కడకు చేరుకొని తమ ఆరాధ్యదైవమైన స్వామి వారిని భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. వీటన్నిటికీ మించి కాశయ్యపాలెంలోని సాయిబాబా గుడి మరింత ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ నిత్యపూజలు చేస్తారు.



పద్మశాలి వీధిలోని శివలింగం



లక్ష్మీపురంలోని కొలువు దీరిన కలియుగ వేంకటేశ్వరస్వామి



దానప్ప తల్లి

వడ్లపూడిలో..

వడ్లపూడిలో రామాలయం, శివాలయం, గణేశుడిగుడి, కుంచుమాంబ ఆలయాలు ప్రాచుర్యం పొందాయి. ఇక కణితి రజక వీధికిలో బుద్ధి సిద్ధి వినాయకుని గుడి, శివాలయం, మహాలక్ష్మి అమ్మవార్లు ఆ ప్రాంతంలో భక్తుల పూజలను అందుకొంటూ దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఇక సిద్ధార్థ నగర్‌లో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దుగ్గవానిపాలెంలో కొలువుతీరిన దానప్ప తల్లికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ తల్లిని ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవంగా కొలుస్తారు. ఎనిమిదేళ్లకు ఒక సారి ఉత్సవం నిర్వహిస్తారు. కొంగవీధిలో రామాలయాన్ని తాజాగా నిర్మిస్తున్నారు. ఇలా చెప్పుకొంటూ వెళ్తే రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీ, గ్రీన్‌సిటీ, యాదవజగ్గరాజుపేట, పాకూర్మన్నపాలెం ప్రాంతాల్లో లెక్కకు మించి ఆలయాలు వెలశాయి. కాలనీల్లో యువకులు, పెద్దలు కమిటీలుగా ఏర్పడి మరిన్ని దేవాలయాల నిర్మాణానికి ఆసక్తి చూపడం విశేషం.

ప్రశాంతత



> కూర్మన్నపాలెం లోకరక్షకుడైన శ్రీరాముడిని ఆరాధించే వారు అనేకమంది ఉన్నారు. అందు వల్లే రామాలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. భక్తులు మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం.
>
> - పెంట యత్వంత్‌శర్మ, అర్చకుడు కణితి రామాలయం

సొంతనిధులతో..



> మా సొంత నిధులతోనే ఆలయాలు నిర్మించుకున్నాం. స్టీల్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో అనేక గ్రామాలు పోయాయి. వాటి స్థానంలో కొత్తగా ఆలయాలు నిర్మించుకుని నిత్య ఆరాధన చేస్తున్నాం. ప్రజలంతా సంతోషంగా ఉంటున్నాం.
>
> - వై. రమణ, ఏడుగుళ్ల ఆలయకమిటీ ప్రతినిధి

భక్తిభావం



> ఉక్కు నిర్వాసిత కాలనీల్లో నివసిస్తున్న ప్రజలకు భగవంతుడిపై అపారమైన నమ్మకం ఉంది. అందువల్లే ప్రతి నిర్వాసిత కాలనీలో, ప్రతి వీధిలో తమకు ఇష్టమైన దేవాలయాలను నిర్మించుకొని పూజలు చేస్తూనే ఉంటారు. ఇది మంచి సాంప్రదాయం.
>
> - ఎం.వి.ఎస్.గణేష్ శర్మ, ప్రధాన అర్చకుడు, ఉమారామలింగేశ్వర ఆలయం



కణితిలోని అమ్మవార్లగుడులు



కణితి రామాలయంలో ని రాముని విగ్రహాలు

కోర్కెలు నెరవేరుతాయి



> త్రిశక్తి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆలయంలో ఉన్న అమ్మవార్లను దర్శించుకొంటే కోరిన కోర్కెలు నెరవేరతాయని ప్రజలకు మంచి నమ్మకం. అందువల్లే అను నిత్యం ప్రజలు అమ్మవార్ల దర్శనానికి తరలివస్తారు. కమిటీ ఆధ్వర్యంలో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తాం.
>
> - ఎ.సూర్యనారాయణ, చైర్మన్ త్రిశక్తి, ఆలయం

డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం



ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం బాటిళ్లు

గాజువాక: అనధికారికంగా విక్రయిస్తున్న డిఫెన్స్ మద్యం బాటిళ్లను గాజువాక ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయించడానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూరెడ్డి మహేష్ అనే వ్యక్తికి నేవల్ డాక్‌యార్డు ఉద్యోగులతో పరిచయాలున్నాయి. ఆ పరిచయాలతో మద్యం బాటిళ్లను సేకరించి బయట అనధికారికంగా అధిక ధరకు విక్రయిస్తున్నాడు. ఈ అక్రమ అమ్మకాలపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఎక్సైజ్ సిబ్బందితో కలిసి షీలానగర్‌లో దాడి చేసి వివిధ బ్రాండ్లకు చెందిన 29 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహేష్‌ను రిమాండ్‌కు తరలించారు. ఏఈఎస్ టి.రాజశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన దాడిలో ఎస్ఐ ముసలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

బీచ్‌రోడ్డు: తొలగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి వెంటనే తీసుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష 1554వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు జీతాలు పెంచాలనో, రెగ్యులర్ చేయాలనో సమ్మె చేయడం లేదని, ప్రభుత్వమే పథకం ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించడం వల్ల వారు ఈరోజు సమ్మెలో ఉన్నారని తెలిపారు. ఇది జీవన్మరణ పోరాటం అన్నారు. ఈ పోరాటానికి ఐద్వా సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఇప్పటికే మూడు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో ఎక్కువ మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. అలాగే భూములిచ్చి త్యాగం చేశారని గుర్తు చేశారు. రెండవ దఫా ఎసెట్ మానిటైజేషన్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఎక్కడెక్కడి ప్రభుత్వ ఆస్తులను అమ్మేయడం, డబ్బులు చేసుకోవడమే మానిటైజేషన్ అన్నారు. నీతి అయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారని, అయితే స్టీల్ ప్లాంట్ గురించి కనీసం మాట్లాడినట్టు వార్తలు రాలేదన్నారు. అంటే స్టీల్‌ప్లాంట్ ను వదిలించుకునే కుట్రలో భాగస్వాములు అయినట్టు భావించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. విమల, బి. ఈశ్వరమ్మ, బి. భారతి, కె. కుమారి, జి. లక్ష్మి, డి. కొండమ్మ, వి. ప్రభావతి, కె. సంతోషం, మమత, నిర్మల, హైమావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

అల్లిపురం: బ్రిటీష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్చి కేంద్ర బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెచ్చింది. దీనివల్ల కార్మికుల ప్రాథమిక హక్కులైన సంఘం ఏర్పాటు, సమ్మె చేయడంతో సహా అనేక హక్కులు కోల్పోతారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని 9న దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందన్నారు. యావత్ కార్మికవర్గం సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ రోజుకు 8 గంటల బదులు 12 పని గంటలు చేయాలని లేబర్ కోడ్‌లు చెబుతున్నాయని తెలిపారు. కార్మికవర్గం సమ్మె చేస్తే ఒకరోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్ అవుతుందన్నారు. బీఎంఎస్ లేబర్ కోడ్‌లను సమరిస్తూ జూలై 9 నాటి కార్మిక సమ్మెను వ్యతిరేకించడం కార్మికవర్గానికి ద్రోహం చేయడమే అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను బీఎంఎస్ సమర్థించడం సిగ్గుచేటన్నారు. దీనిని బీఎంఎస్ నాయకత్వం సమర్థించడం విశాఖ స్టీల్‌కు ద్రోహం చేయడమేనన్నారు.

పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

అల్లిపురం: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి, అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు 5వ తేదీన ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ పిలుపునిచ్చారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని, అదానీతో సోలార్ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలను మూడు సార్లు పెంచి ప్రజలపై రూ.15,487 కోట్ల భారం వేసిందని ఆరోపించారు. మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ పి. చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాలు, ఎం.మన్మథరావు, ఎస్. నాగభూషణ్, ఎండీ బేగం, అన్వేష్, బుజ్జి పాల్గొన్నారు.

శేష జీవితం హాయిగా సాగాలి



కృష్ణ, సత్యవతి దంపతులను సత్కరిస్తున్న నీటి సరఫరా విభాగం సిబ్బంది

పెదగంట్యాడ: జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో పైప్‌లైన్ ఫిట్టర్‌గా పనిచేసి రిటైర్ అయిన గట్రెడ్డి కృష్ణ దంపతులను నడుపూరు నీటి సరఫరా విభాగంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా నీటి సరఫరా విభాగంలో కృష్ణ అందించిన సేవలు ఎందరికో ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, నీటి సరఫరా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: ఇటీవల క్రికెట్ ఆడుతూ ఒకరినొకరు ఢీకొని తీవ్రంగా గాయపడిన పెదకోరాడకు చెందిన బసా కార్తీక్‌రెడ్డి, గొందేశి భరత్‌ను పెదకోరాడ గ్రామానికి చెందిన మిత్తిన అప్పలరెడ్డి స్థానికులతో కలసి బుధవారం పరామర్శించారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, బసా పీరురెడ్డి, మధుసూదనరావు, పెద్దలు పులి రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: టింపనీ11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టింపనీ ఫీడర్ పరిధిలో ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, వుడా ఫేజ్-2 ఏరియా, అమరావతి నగర్, భరత్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చినుకు పడితే అడుగు వేయలేం



వుడా కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు



కర్ణవానిపాలెంలో బురదమయమైన రోడ్డు



శ్రీనగర్‌లో రోడ్డు ఇలా..

గాజువాక: గాజువాకలో పలు రహదారులు వర్షంతో చిత్తడిగా మారాయి. రెండు రోజులుగా తెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వివిధ చోట్ల చేపట్టిన అభివృద్ధి పనుల నేపథ్యంలో తవ్వేసిన రోడ్లపై గోతులు పడడంతో వర్షపు నీటివల్ల అస్తవ్యస్తంగా మారాయి. చినగంట్యాడ వందడుగుల రోడ్, కణితి రోడ్, వుడా డబుల్ రోడ్, శ్రీనగర్, కర్ణవానిపాలెంలలోని రోడ్లపై గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు. జాతీయ రహదారిపై కుంచుమాంబ ఆలయం వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు అసౌకర్యానికి గురయ్యారు.

కొండవాలులో బిక్కుబిక్కు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంత ప్రజలు వణుకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు. పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ (రక్షణ గోడల)ను నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదించిన టెండర్లను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ప్రభుత్వంలోనే సుమారు ఐదు నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలు టెండర్ల దశకు వెళ్లకపోవడంతో జనం ఆవేదన చెందుతున్నారు.



చినగంట్యాడలో రోడ్డుపై బురద

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

అల్లిపురం: బీఎస్ఎన్ఎల్ నష్టాలకు ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలు తప్ప మరొకటి కాదని పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ పీఈసీహెచ్‌వీ సాగర్, జిల్లా అధ్యక్షుడు వి.కూర్మలింగం, త్రినాథ్‌రెడ్డి తదితరులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం డాబాగార్డెన్స్‌లో గల బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద గేట్ డిమానిస్ట్రేషన్ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్లతో సార్వత్రిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.